నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 16 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM

సీజనల్.. గోలీలు నిల్

భద్రాద్రి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో తీవ్రంగా మందు బిళ్ల ల కొరత
ఒకటీ అరా మినహా మిగతా వాటికి బయటకు పంపుతున్న వైద్యులు
ఓ వైపు ముసురుకుంటున్న వ్యాధులు.. మరోవైపు నిండుకున్న మందులు

తిరుమలాయపాలెం : జిల్లా వైద్యాధికారి మాలతి ఆధ్వర్యంలో జ్వరపీడితులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది.

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15 (నమస్తే తెలంగాణ) : అసలే వ్యాధుల కాలం.. ఓవైపు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు పారిశుధ్యలోపంతో వ్యాధులు ముసురుకుంటున్నాయి. దానికితోడు అనుకోని వ్యాధులు, ఆకస్మిక ఘటనలు, మరెన్నో ప్రమాదాలు.. వెరసి ప్రభుత్వాసుపత్రులకు రోజురోజుకూ రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రస్తుత ప్రభుత్వంలోని సర్కారు వైద్యశాలల దొల్లతనం ఇక్కడే బయటపడుతోంది. అధికారంలోకి ఏడు నెలలు దాటినా ప్రస్తుత కాంగ్రెస్ పాలకులకు ప్రభుత్వాసుపత్రుల గురించి పట్టింపేలేకుండా పోయింది. దీంతో ఎన్నో ఆశలతో, మరెంతో ధైర్యంతో సర్కారు వైద్యశాల గడప తొక్కిన రోగులకు నిరాశే ఎదురవుతోంది. ముఖ్యంగా మందుల కొరత కారణంగా రోగులు, వారి కుటుంబీకులు చుక్కలు చూస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిల్చొని వేచి చూసిన రోగులకు.. 'ఇంకొన్ని మందు బిళ్లలు లేవు. బయట తీసుకోండి.' అంటూ అక్కడి ఫార్మసీ సిబ్బంది చేస్తున్న సూచనలు అంతులేని ఆవేదనను మిగుల్చుతున్నాయి. 'బయట కొనుక్కునే స్తోమతే ఉంటే మేము ఇక్కడిదాకా ఎందుకొస్తాం..' అని నిట్టూర్చుకుంటూ ఒంట్లో సత్తువను కూడగట్టుకొని ప్రైవేటు మందుల షాపు బాట పడుతున్నారు. ముఖ్యంగా భద్రాద్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలతోపాటు ఇతర ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక వైద్యశాలల్లో ఇటీవల కాలంలో ఈ దృశ్యాలు నిత్యకృత్యంగా కన్పిస్తున్నాయి.

కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి

విజృంభిస్తున్న వ్యాధులు..

వర్షాలు కురుస్తుండడం, వాతావరణంలో మార్పులు రావడం వంటి కారణాలతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే సాధారణ సీజనల్ వ్యాధుల బాధితులతోపాటు మలేరియా, డెంగీ జ్వరాల పీడితులు కూడా మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర, ఏరియా ఆసుపత్రులకు వస్తున్నారు. అంతగా వ్యాధులతో బాధపడుతూ ఎన్నో ప్రయాసలకు ఓర్చి ప్రభుత్వాసుపత్రిదాకా వస్తే.. ఇక్కడి మందుల కొరత వారిని మరింత ముప్పుతిప్పలు పెడుతోంది.

ఉన్నవి కొన్ని రకాలే..

'ఉన్నవి కొన్ని రకాలే. మిగతావి కావాలంటే బయటకు వెళ్లండి.' అంటున్నారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి ఫార్మసీ సిబ్బంది. దీంతో దిక్కుతోచని స్థితి ఆ మందుల చీటీని పట్టుకొని ముక్కుతూ మూలుగుతూ బయటకు వెళ్తున్నారు ఆసుపత్రికి వచ్చిన రోగులు. సాక్షాత్తూ డీఎంఈ పరిధిలో ఉన్న జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉందంటే పరిస్థితి ఎంతటి స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 'బీపీ, షుగర్ గోలీలు రెండు రకాలు తప్ప వేరేవి లేవు. బీపీ 40 ఎంజీ తప్ప మిగతావి కూడా లేవు. నాలుగు రకాల యాంటీ బయాటిక్ మాత్రల్లో రెండు రకాలు మాత్రమే ఉన్నాయి. అందుకే ఎవరికైనా అవే ఇస్తున్నాం.' అంటున్నారు ప్రధానాసుపత్రి ఫార్మసీ సిబ్బంది. ఇక ఇన్ పేషెంట్లు ఆసుపత్రిలో చేరి వారం రోజులు వైద్య సేవలు పొందుతున్నా మందులు మాత్రం అన్ని రోజులకు సరిపడా ఎవరికి వారు బయట తెచ్చుకోవాల్సిన పరిస్థితి. రామవరం మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో కూడా దాదాపు ఇదే పరిస్థితి. జిల్లాలో 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు, 5 పీపీ యూనిట్లు, మరో 5 ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీకి అనుబంధంగా జనరల్ ఆసుపత్రి ఉన్నా.. అన్నింటిలోనూ మందుల కొరత సమస్య కామన్‌గానే ఉంది. చివరికి అజిత్రోమైసిన్, పాంటాప్రోజోల్, డైక్లో సహా మరికొన్ని మందుల కోసం ప్రభుత్వ వైద్యులిచ్చిన ప్రిస్క్రిప్షన్ పట్టుకొని బయట మందుల షాపులకు వెళ్లిన రోగులకు జేబులు గుల్లవుతున్నాయి.

కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందుల గది వద్ద బారులు తీరిన రోగులు

బయటకు రాయడం లేదు..

మందుల కొరత లేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన మందులను ఇస్తున్నాం. కొందరు రోగులు బయటకు రాయండని కోరుతున్నారు. అంతే తప్ప మేము బయటకు ఎవరికి రాయడం లేదు. వెంటిలేటర్ సమస్య ఉన్న మాట వాస్తవమే. మరమ్మతుల గురించి అధికారులకు తెలియజేశాం. త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయి.

–డాక్టర్ రాధామోహన్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

పదింటిలో రెండు వెంటిలేటర్లే వర్కింగ్..

భద్రాద్రి జిల్లా ఆసుప్రతిలో వెంటిలేటర్లది మరో ప్రధాన సమస్యగా ఉంది. మొత్తం ఇక్కడ పది వెంటిలేటర్లు ఉన్నాయి. కానీ వాటిల్లో రెండు మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో సీరియస్ కేసులు వస్తే ఖమ్మం, వరంగల్ ఆసుపత్రులకు ఇక్కడి వైద్యులు రిఫర్ చేస్తున్నారు. గతంలో అందుబాటులో ఉన్న ఆక్సీజన్ ప్లాంట్ కూడా కూడా ఇప్పుడు మూతపడింది.

బయటకు వెళ్తే రూ.2 వేలు అయ్యాయి..

మా అమ్మకు కాలునొప్పి వస్తే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాను. రెండు రోజులు ఇక్కడే ఉన్నాం. ఆసుపత్రిలో అన్ని మందులూ లేవని చెప్పారు. మిగతావన్నీ బయట మెడికల్ షాపుల్లో కొనుక్కోమని చెప్పి చీటీ రాసిచ్చారు. ఆ చీటీ తీసుకొని బయట మందుల షాపుకు వెళ్తే అక్కడ రూ.2 వేల బిల్లు అయింది. ప్రభుత్వాసుపత్రిపై నమ్మకంతో ఇక్కడి దాకా వచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. మందు బిళ్లలు బయటకు కొనుక్కునే పరిస్థితే అయితే ఇంత దూరం ప్రయాణించి సర్కారు దవాఖానకు ఎందుకు వస్తాం?

–శివ, రోగి కుమారుడు, జూలూరుపాడు మండలం

ఇండెంట్ పెట్టాం..

అన్ని మందులూ లేవని కాదు. కొన్ని మందులు రాలేదు. త్వరలోనే వస్తాయి. అందుకోసం ఇండెంట్ పెట్టాం. స్టోర్ ఖమ్మంలో ఉంది. ఏ ఆసుపత్రికి వచ్చినా అక్కడ నుంచే రావాలి. రాగానే అన్ని ఆసుపత్రులకు సరఫరా చేస్తాం. యాంటీ బయాటిక్స్ రెండు రకాలు ఉన్నాయి. మలేరియా మాత్రలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి జిల్లా

'ఖమ్మం'లోనూ అరకొరే..

ఖమ్మం సిటీ, జూలై 15: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసిన గత కేసీఆర్ సర్కారులో కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలందించిన ఖమ్మం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలు.. ఏడెనిమిది నెలల క్రితం వచ్చిన కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. పల్లె, బస్తీ దవాఖానలు మొదలుకొని కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, ఇంటింటికీ వైద్య పరీక్షలు, కంటి వెలుగు కార్యక్రమాలు సహా ఇత్యాది వైద్య సదుపాయాలతో గత కేసీఆర్ సర్కారులో ఆరోగ్య తెలంగాణ ఆవిష్కృతమైంది. కానీ ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఆనవాళ్లు లేకుండా చేస్తోంది.

వేధిస్తున్న మందుల కొరత..

ఖమ్మం జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో 30 పీహెచ్‌సీలు, 4 యూహెచ్‌సీలు, 161 పల్లె దవాఖానలు, 9 బస్తీ దవాఖానలు ఉన్నాయి. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా సార్వజనీన ఆసుపత్రితోపాటు తిరుమలాయపాలెం, మధిర, వైరా, సత్తుపల్లి, పెనుబల్లి, నేలకొండపల్లి వైద్యశాలలు కొనసాగుతున్నాయి. నాటి కేసీఆర్ సర్కారు ఖమ్మం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో పెద్దాసుపత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లింది. ఆయా ఆసుపత్రుల్లో గుండె, కిడ్నీ, నరములు, సాధారణ ప్రసవాలతోపాటు ఎమర్జెన్సీ సేవలు సాధారణ పౌరులకు అందుబాటులోకి వచ్చాయి. కానీ ప్రజా పాలన పేరుతో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెనుకటి రోజులను పునరావృతం చేస్తోంది. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు..' అనే పరిస్థితిని తెచ్చింది. మరోవైపు జిల్లాలో సీజనల్ వ్యాధులు మొదలయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారమే జిల్లాలో ప్రస్తుతం 9,024 మంది విష జ్వరాల బారిన పడ్డారు. వారిలో 195 మందికి డెంగీ పాజిటివ్‌గా తేలింది. జ్వరాల బారిన పడిన వారికి తక్షణ అవసరంగా అందించే 'పారాసిటమాల్' ఐఎం, ఐవీ ఇంజక్షన్లు జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కడా లేవు. కడుపు నొప్పి, కడుపులో మంటకు, గ్యాస్ట్రిక్ ప్రాబ్లమ్‌కు అవసరమైన 'ర్యాన్‌టాక్, పాంటాప్' మందులు అందుబాటులో ఉంటే ఒట్టు. విష జ్వరాలను గుర్తించే నిమిత్తం నిర్వహించేందుకు ఉపయోగించే వైద్య పరీక్షల కిట్లు కూడా అరకొరే. పైగా, దవాఖానలో కీలకమైన వైద్య పరీక్షలకు బాధితులను స్థానిక వైద్యులు బయటికి పంపించాల్సి వస్తోంది. పలు రకాల మందులు సైతం సరిపడా లేనందున డాక్టర్లు చీటీలు రాస్తే రోగులు బయట కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

పారాసిటమాల్ ఇంజక్షన్స్ లేవు..

జిల్లాలో మందుల కొరత లేదు. సీజనల్ జ్వరాలకు సంబంధించిన అన్ని రకాల మందులను ప్రభుత్వాసుపత్రులన్నింటికీ సరఫరాం చేశాం. ప్రతీ దవాఖానలో డెంగీ కిట్లు ఉన్నాయి. కానీ జ్వర తీవ్రత పెరిగితే వినియోగించాల్సిన పారాసిటమాల్ ఇంజక్షన్లు మాత్రం అందుబాటులో లేవు. 'ర్యాన్‌టాక్, పాంటాప్' మందులు నిండుకున్న మాట వాస్తవమే. ఆసుపత్రుల అభివృద్ధి నిధులు (హెచ్‌డీఎస్) కోసం ప్రతిపాదనలు పంపాం. తొందరలోనే ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేస్తుందని ఆశిస్తున్నాం.

–డాక్టర్ మాలతి, డీఎంహెచ్‌వో, ఖమ్మం

బీఆర్‌టీయూను ఆదరించండి..

- ఐటీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం


నాయకులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బూర్గంపాడు, జూలై 15 : ఐటీసీ పీఎస్‌పీడీ భద్రాచలం యూనిట్‌లో త్వరలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అనుబంధ భారత ట్రేడ్ యూనియన్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, బీఆర్ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ముఖ్య కార్యవర్గ సన్నాహక సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. ఐటీసీలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూను ఆదరించాలని కోరారు. ఐటీసీలోని కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సానికొమ్ము శంకర్‌రెడ్డి, మహ్మద్ సాబీర్ పాషా పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వండి

- 'జల్లేపల్లి' జ్వరపీడితులకు సత్వర వైద్య సేవలు అందించండి
- బాధితుల పరామర్శలో మంత్రి పొంగులేటి

అపరిశుభ్రతతో ఉన్న వీధులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

తిరుమలాయపాలెం, జూలై 15: పారిశుధ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో కొద్ది రోజులుగా ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌తో కలిసి సోమవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించారు. కాలనీలన్నీ కలియదిరిగి అపరిశుభ్ర వీధులను పరిశీలించారు. ఆయా ఇళ్లకు వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధుల్లో అపరిశుభ్రతను మెరుగుపర్చాలని ఆదేశించారు. జల్లేపల్లిలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. రోగులకు మందులు అందజేయాలని, గ్రామంలో దోమతెరలు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అధికారులతో మాట్లాడుతూ.. జ్వరాలు వచ్చే వరకు చూడకుండా అధికారులే ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే 20 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అపరిశుభ్రంగా మురుగు కూపాలుగా మారిన వీధులను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. పంచాయతీ కార్యదర్శి ధనమ్మపైనా, మరికొందరు అధికారులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బోడ మంగీలాల్, బెల్లం శ్రీనివాసరావు, మాలతి, శేషాద్రి, రామకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

'ప్రజాభవన్'లకు అంగన్‌వాడీల సెగ

- జీవో 10ని రద్దు చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి

కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15 (నమస్తే తెలంగాణ), నమస్తే నెట్‌వర్క్ : జీవో నెంబర్ 10ని కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలని చూడడం దుర్మార్గపు చర్య అంటూ అంగన్‌వాడీలు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఎర్రజెండాలతో నిరసన తెలిపారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల(ప్రజాభవన్) ఎదుట పెద్దఎత్తున ధర్నాలకు దిగారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట, ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాభవన్‌లను ముట్టడి చేసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, జూలై 1 వరకు 65 సంవత్సరాలు నిండిన టీచర్లు, హెల్పర్లను ఉద్యోగ విరమణ చేయాలని జారీచేసిన జీవో 10ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, సీపీఎం అనుబంధ సంఘం సీఐటీయూ నాయకులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

'సీతారామ' పనులను అడ్డుకున్న అఖిలపక్షం

జూలూరు పాడుకు సాగు, తాగునీరు ఇవ్వాలని డిమాండ్
ఈ ప్రాంత రైతాంగాన్ని విస్మరిస్తే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం
పనులను నిలిపివేయకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమాలు

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపపక్షం నాయకులు

జూలూరుపాడు, జూలై 15 : సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ ద్వారా సాగు, తాగునీటిని తమ మండలానికి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామ సమీపంలో చేపట్టిన సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ నిర్మాణ పనులను సోమవారం అడ్డుకున్నారు. తహసీల్దార్ స్వాతిబిందుకు ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారం సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి మండలంలోని కాకర్ల, గుండెపుడి, పాపకొల్లు గ్రామాల్లోని చెరువులకు పిల్లకాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాకతీయుల కాలం నాటి పోలారం చెరువుకు మరమ్మతులు చేపట్టి ప్రాజెక్ట్‌ను నీటితో నింపితే జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగు నీరందించవచ్చని తెలిపారు. అలా చేయకుండా.. ఈ ప్రాంత రైతాంగాన్ని విస్మరిస్తే భవిష్యత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. మండల రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా వినోభానగర్ నుంచి సాగర్ కెనాల్ వరకు మంజూరైన లింక్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని, లేకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ముగ్గురు మంత్రులుండి.. జూలురుపాడు మండలంలోని రైతుల భూములను ఎండబెట్టేందుకు లింక్ కెనాల్ పేరుతో డిజైన్ మార్చి పనులను శరవేగంగా చేపట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు జాటోత్ కృష్ణ, చంద్రనరేంద్రకుమార్, ఉమర్‌మియా, ఏదులాపురం గోపాలరావు, గుండుపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేశ్, వల్లోజి రమేశ్, చాంద్‌పాషా, బానోత్ మధు, వల్లమల చందర్ రావు, లకావత్ శ్రీను, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, గడిదేశి కనకరత్నం, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక బృందాలు : సీపీ సునీల్ దత్

మామిళ్లగూడెం, జూలై 15 : జిల్లాలో డ్రగ్స్ సరఫరా, నిర్మూలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతోపాటు సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం, నియంత్రణపై ఈ బృందాలు నిరంతరం పని చేస్తాయని తెలిపారు. ప్రధానంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, డీ అడిక్షన్, ప్రివెన్షన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీస్ శాఖ యాంటీ నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం యాంటీ డ్రగ్ కంట్రోల్ విభాగం 8712659123 సెల్ ఫోన్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గంజాయి వినియోగిస్తున్న వారిని సైతం గుర్తించి వైద్య సదుపాయం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దులో ఉన్న ఏపీ, ఛత్తీస్‌గఢ్ నుంచి రోడ్డు మార్గం ద్వారా మత్తు పదార్థాలు రవాణా జరుగకుండా తనిఖీలు పటిష్టం చేసేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైతు రుణమాఫీకి షరతులు

- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఖమ్మం వ్యవసాయం, జూలై 15: రైతుల పంట రుణాల మాఫీ అమలుకు ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. ఆ మార్గదర్శకాలను సోమవారం విడుదల చేసింది. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అమలుచేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్.. రైతులకు హామీ ఇచ్చిన విషయం విదితమే. అయితే అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఆరునెలల అనంతరం ఎట్టకేలకు రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 12, 2024 మధ్యకాలంలో పంట రుణాలు తీసుకున్న వారికి కుటుంబంలో ఒక్కరికి మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని పేర్కొన్నది. అదేవిధంగా రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే మాఫీ వర్తిస్తుందని, రీ షెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించే అవకాశం ఉండదని తెలిపింది. రూ.2 లక్షల పైబడి పంట రుణాలు తీసుకున్న రైతులు ఆ పైబడిన రుణాన్ని ముందుగా చెల్లిస్తేనే మాఫీ వర్తించనుంది. స్వయం సహాయక, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, ఎల్ఈసీఎస్ రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ వర్తించదు. ఇలా అనేక కొర్రీలతో కూడిన మార్గదర్శకాలను వెలువరించింది. ఈ రుణమాఫీ పథకం పారదర్శకంగా అమలు చేసేందుకు గాను బ్యాంక్ ఆఫీసర్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమిస్తారు. ఆయనతో కలిసి ఏడీఏ పర్యవేక్షణ చేయనున్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి అనేక కొర్రీలు పెట్టడం ద్వారా రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డులు లేనివారికి రుణమాఫీ వర్తించకపోవడం సరికాదని వాపోతున్నారు. వడపోతలు కాకుండా రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

డ్రైనేజీ కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్
ఏఈ హామీతో ఆందోళన విరమించిన గ్రామస్తులు

చండ్రుగొండ–జూలూరుపాడు రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

చండ్రుగొండ, జూలై 15 : చండ్రుగొండ–జూలూరుపాడు రహదారికి ఇరువైపులా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణంలో జాప్యం జరుగుతోందని, వెంటనే దానిని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చండ్రుగొండ–జూలూరుపాడు రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెంటనే జోక్యం చేసుకొని నిర్మాణ పనులకు ఉన్న అడ్డంకులను తొలగించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా.. గ్రామస్తులు రోడ్డుపై ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎస్సై జి.స్వప్న అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ లకన్‌నాయక్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడి.. గ్రామస్తుల డిమాండ్‌ను ఆయనకు వివరించారు. దీనికి స్పందించిన ఏఈ వారంలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.